


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**‘‘డామిట్.** వాడు చస్తే చచ్చాడు కానీ శ్రీ కళ్యాణికి నీమీద ఏ అనుమానమూ రాలేదు గా?’’ అన్నాడు ప్రతాపరెడ్డి.

‘‘రాలేదు. తన భర్తని పొడిచిందీ, అనూజ్ఞని క్రిందికి తోసేసిందీ అశ్వత్థామే అనుకుంటోంది.’’

‘‘కార్తికేయ ఎలా ఉన్నాడు?’’ ప్రతాపరెడ్డి అడిగాడు. అతడు చాలా వర్రీడ్‌గా ఉన్నాడు.

‘‘ఆస్పత్రిలో ఆపరేషన్ జరుగుతోంది.’’

ప్రతాపరెడ్డి లేచాడు. ‘‘ఇప్పటివరకూ నేను తెరవెనుక ఉండి కథ నడిపిద్దామనుకున్నాను సత్యం. కానీ అన్నీ పొరపాట్లే జరుగుతున్నాయి. కార్తికేయ ఎటువంటి పరిస్థితుల్లోనూ బ్రతక్కూడదు. పద. డాక్టర్ బదరీప్రసాద్‌తో నేను స్వయంగా మాట్లాడాలి’’.

మొత్తం జరిగినదంతా చెప్పి ‘‘అదీ మాడమ్ జరిగింది. మీరు వెంటనే పోలీస్ రిపోర్టు ఇవ్వటం మంచిది’’ అన్నాడు డాక్టర్ బదరీప్రసాద్.

అతను చెప్పినదంతా విన్నది కానీ కార్తికేయనే చూస్తోంది శ్రీకళ్యాణి. కార్తికేయకి ఇంకా స్పృహ రాలేదు. ఆమె ఏం చెపుతుందా అని పీటర్ ఎదురు చూస్తున్నాడు. అతని రక్తం సలసల మరుగుతోంది. అదే వేడిలో సత్యాన్నీ, ప్రతాపరెడ్డినీ ఎందుకు కాల్చి చంపలేదా అనుకుంటున్నాడు.

‘‘డాక్టర్‌గా నేను ఎన్నో కేసుల్ని చూశాను. కానీ మనుషుల్లో ఇలాటి నరరూప రాక్షసుల్ని చూడటం ఇదే మొదటిసారి’’ అన్నాడు డాక్టరు. కళ్యాణి దానికీ మాట్లాడలేదు. ఆమె కళ్ళముందు పాతిక సంవత్సరాల క్రితం నాటి దృశ్యం కదుల్తోంది. తన తండ్రి మొహంమీద తన మావయ్య... సత్యం తండ్రి... తలదిండు ఒత్తి చంపటం..! అలాటివాడి కొడుకుని పక్కలో పాములా ఇంతకాలం పెట్టుకుంది. ఎన్నో విషయాల్లో ఎంతో జాగ్రత్తగా ఉండేవాళ్ళు చిన్న విషయాల్లో నిర్లక్ష్యంగా ఉంటారని చెప్పడానికి తనే ఉదాహరణ.

‘‘ఆయనకేం ప్రమాదం లేదుగా డాక్టర్?’’

''ఆపరేషన్ సక్సెస్ అయింది కళ్యాణిగారు. స్పృహ రావటానికి కొంతకాలం పడుతుంది. అయితే, బయట నుంచి వచ్చే ప్రమాదాలకి నేనేం చెయ్యలేను. వాళ్ళు నాకే లంచం ఇవ్వజూపారు. అదీ భయం. నేను మీకు బాగా తెలుసని వాళ్ళకి తెలీదు.''

''వాళ్ళ సంగతి నేను చూసుకుంటాను.''

ఇది జరిగిన మరుసటి రోజు...

''నన్ను నువ్విలా మోసం చేస్తావని కలలో కూడా అనుకోలేదు సత్యం'' బాధగా అంది కళ్యాణి.

సత్యం ఉలిక్కి పడి, ''నేను నిన్ను మోసం చేశానా?'' అన్నాడు.

''నా భర్త గురించి అన్ని విషయాలూ తెలిసుండీ నాకు చెప్పకపోవటం మోసం కాదా?''

సత్యం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. ''నేను చెబుతూనే ఉన్నాను. నువ్వు నమ్మలేదు.''

''కార్తికేయకు విడాకులు ఇద్దామనుకుంటున్నాను.''

సత్యం ఆశ్చర్యంతో "ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నావా?" అన్నాడు.

''ఇంత జరిగాక ఏమీ ఎరగనట్టు అతనితో కాపురం చెయ్యమంటావా? నా సంగతి నీకు బాగా తెలుసు కదా. నా భర్త... ఐ మీన్... కార్తికేయ... ప్రతాపరెడ్డి కలసి ఇంత ప్లాన్ చేశారు నిజమే. కానీ ఇందులోకి అశ్వత్థామ ఎలా వచ్చాడు? అదే అర్థం కావడంలేదు''

''ముగ్గురూ ఒక్కటే గ్రూపు. అశ్వత్థామ క్రింద కార్తికేయ కొంతకాలం పనిచేశాడన్న విషయం మర్చిపోకు'' అన్నాడు సత్యం. ''...అసలు నువ్వా రాత్రి ఆ సైకాలజిస్ట్ ... అదే... ఆ అశ్వత్థామకి ఫోన్ చేయటంతోనే ఈ కథ ప్రారంభమైందనుకుంటాను.''

''ఇంత జరిగాక నీకో విషయం చెప్పక తప్పదు సత్యం. అశ్వత్థామని పీటర్ కాల్చిచంపాడు.''

''నాకు తెలుసు'' సత్యం అన్నాడు.

ఆమె ఆశ్చర్యంతో ''నీకు తెలుసా? మైగాడ్... నీ తెలివితేటలు అపూర్వం'' అంది.

ఆ సమయానికి ఫోన్ మ్రోగింది. అట్నుంచి డాక్టర్ బదరీప్రసాద్. ''కార్తికేయకు స్పృహ వస్తోంది. మీరు వెంటనే బయలుదేరి రండి'' అని చెప్పాడు. ఆమె సత్యానికి గుడ్‌నైట్ చెప్పి బయల్దేరింది. ఫోన్‌లో తెలిసిన విషయం ఏమిటో చెప్పలేదు.

**అతడు** నెమ్మదిగా కళ్ళు విప్పాడు. ముందు మసక మసగ్గా... తరువాత స్పష్టమైన ఆకారాన్ని పొందుతూ... తన భార్య కనిపించింది. ఎప్పుడూ పక్కని ఆశ్రయించుకొని ఉన్న ఆమెని చూడటానికి అలవాటుపడిన కళ్ళకి, 'నిల్చుని' ఉన్న భార్యని చూడగానే ఎవరో కొత్త స్త్రీని చూస్తున్నట్లు అనిపించింది. ఆమె శ్రీకళ్యాణి అని గుర్తించగానే ఆనందోద్వేగాలు ఆపుకోలేక అతడు పక్క మీద నుంచి లేవబోయాడు. కడుపు దగ్గర కుట్లు బాధ పెట్టటంతో అతడు తిరిగి కళ్ళు మూసుకున్నాడు. శ్రీకళ్యాణి అతడి దగ్గరగా వచ్చి అతడి చేతిని తన చేతుల మధ్యకి తీసుకుంది. ఆమెని అభినందిస్తున్నట్టు తన సంతోషాన్ని ప్రకటిస్తున్నట్టు అతడామె చేతిని నెమ్మదిగా నొక్కాడు.

అంతలోనే మూసిన కనురెప్పల వెనుక... ముద్రించుకున్న చిత్రం ఏదో కదిలినట్టు... అస్పష్టమయిన సంశయానికి ఆకృతి వచ్చినట్టు... జరిగినదంతా వరసగా గుర్తొచ్చి... ఒక అనుమానం అగ్ని పర్వతపు కడుపులో లావాలా కదలి...

''అనూజ్ఞ...ఏ...మైం...ది'' అని అడిగాడు.

ఆ గదిలో చీమ చిటుక్కుమంటే వినపడేటంత నిశ్శబ్దం. అతడు కళ్లు తిప్పి అందరి వంకా చూశాడు. చూపు పీటర్‌మీద నిలచి నిలదీసింది. ఇక తప్పదన్నట్టు పీటర్ అడుగు ముందుకేసి, ''ఆమె మరణించింది'' అన్నాడు.

కార్తికేయకు తిరిగి స్పృహ తప్పింది.

''దీని వెనుక ఉన్నది ప్రతాపరెడ్డి అని నాకు తెలుసు. అందుకే మనిద్దరం ఒక అంగీకారానికి వద్దాం'' అంది శ్రీకళ్యాణి. లాకర్‌లోంచి కాగితాలు తీసి సత్యానికి ఇస్తూ ''వీటిని రిజిష్టర్ చేయించాలి. జాగ్రత్తగా చూడు'' అంది. అతడు వాటిని తీసుకుని చదవసాగాడు. సగం చదివాక అతడు ఆశ్చర్యంతో తలెత్తి ''ఏమిటిది?'' అని అడిగాడు.

''నా సంగతి నీకు తెలుసు కదా. ఏదన్నా అనుకుంటే వెంటనే చేసేస్తాను. కార్తికేయ మీద నా మనసు విరిగిపోయింది సత్యం. నా తప్పు నేను తెలుసుకున్నాను. పెరటి చెట్టు మందుకు పనికి రాదన్నట్టు నిన్ను నిర్లక్ష్యం చేశాను. అందుకే నా ఆస్తిలో సగం వాటా నీకిస్తూ, నిన్ను నా భాగస్వామిని చేసుకుంటున్నాను.''

సత్యం దిగ్భ్రాంతుడై చూశాడు. ఇదంతా కలో నిజమో అర్థం కావటం లేదతడికి.

''ఏమిటి ఆలోచిస్తున్నావ్? ప్రతాపరెడ్డి గురించా? నిజమే. అతడికి చాలా విషయాలు తెలుసు. అతన్ని ఎలా నొక్కాలన్నది తరువాత ఆలోచిద్దాం.''

''నేను ఆలోచిస్తున్నది ప్రతాపరెడ్డి గురించి కాదు. కార్తికేయ గురించి. కార్తికేయకు స్పృహ వస్తే మొత్తం అంతా బయటపడుతుంది. అదీ సమస్య...'' అన్నాడు.

శ్రీకళ్యాణి దానికి సమాధానం చెప్పకుండా కళ్ళు మూసుకుంది. అంతలో ఫోన్ మ్రోగింది. సత్యం రిసీవర్ తీసుకున్నాడు. ''కల్యాణి గారా... నేను డాక్టర్ బదరీప్రసాద్‌ని మాట్లాడుతున్నాను. మీరు చెప్పిన పని పూర్తయింది. కార్తికేయ పరిస్థితి విషమించింది. ఇంకో పది నిముషాల్లో మరణించబోతున్నాడు.''

సత్యం ఒక నమ్మలేని నిజాన్ని చూస్తున్నట్టు రిసీవర్ వైపూ, ఆమె వైపూ మార్చి మార్చి చూశాడు. ఇంకా తేరుకోలేదు.

ఆమె లేచి నిలబడి, ''వెళ్ళి ప్రతాపరెడ్డిని కలుసుకో సత్యం. అతడికి మొత్తం విషయాలు ఎంత వరకూ తెలుసో కనుక్కో. అశ్వత్థామ హత్య విషయంలో ఆ తరువాత అతను మనని బ్లాక్‌మెయిల్ చేయకూడదు'' అంది.

ప్రతాపరెడ్డి గ్లాసు ఎత్తి ''ఛీర్స్...'' అని గుటక వేసి, గ్లాసు క్రింద పెడుతూ ''మొత్తం మీద ఆ డాక్టర్ మనకిచ్చిన వాగ్దానం నెరవేర్చాడన్నమాట'' అన్నాడు.

''కార్తికేయ పదినిముషాల్లో మరణిస్తాడని చెప్పాడు...'' అన్నాడు సత్యం. తరువాత కొంచెం సేపాగి ''నాకు కాస్త ఐస్ కావాలి'' అని అడిగాడు. అది తేవటం కోసం ప్రతాపరెడ్డి లోపలికి వెళ్ళగానే జేబులోంచి చిన్న సీసాతీసి అతడి గ్లాసులో రెండు చుక్కలు వేశాడు.

ప్రతాపరెడ్డి ఐస్ తీసుకొచ్చి సత్యం గ్లాసులో వేసి తనూ ఓ రెండు క్యూబులు వేసుకుని గుక్క తాగాడు. అంతే. వెంటనే గుండెల్లో మంట మొదలయింది. కొన్నాళ్ళ క్రితం హోటల్‌లో రొయ్యని నోట్లో పెట్టుకోగానే శ్రీకళ్యాణి గుండెల్లో వచ్చిన మంట కన్నా పదిరెట్లు ఎక్కువ.

అప్పుడే ఫోన్ మ్రోగింది. ఒక చేత్తో గుండె రాసుకుంటూ, మరో చేత్తో రిసీవర్ తీసుకుని ''హలో'' అన్నాడు.

''డ్రింకు బావుందా?'' అవతల్నుంచి స్త్రీ కంఠం వినిపించింది.

''ఎవరు మాట్లాడేది?''

అట్నుంచి ఒకే ఒక మాట క్లుప్తంగా, స్పష్టంగా వినిపించింది ''... శ్రీకళ్యాణి''.

చేతిలో పాముని పట్టుకున్నట్టు రిసీవర్ వదిలెయ్యబోయి అతి కష్టంమీద నిభాయించుకుని ''ఏమిటి నువ్వు మాట్లాడేది?'' అన్నాడు.

''నా ఉప్పు తింటూ బ్రతికి, నా ఆస్తికే ఎసరు పెట్టదల్చుకున్నావు. నీ ఎదురుగా కూర్చొని ఉన్న వ్యక్తితో చేతులు కలిపి నా మీద హత్యా ప్రయత్నం చేశావు. దానికి ప్రతీకారం.''

''అంటే...''

''నువ్వు చాలా తెలివైనవాడివి ప్రతాపరెడ్డీ. నన్ను చంపి నా భర్తనీ, అతని ప్రియురాల్నీ హత్యానేరంలో ఇరికిద్దామనుకున్నావ్ కదూ. మొత్తమంతా సత్యం చెప్పాడులే''.

ఆమె ఏం మాట్లాడుతుందో అతడికి అప్పుడు అర్థమైంది. ఆమెకి మొత్తం తెలిసిపోయిందని గ్రహించి, ఒక్కసారిగా ముసుగు తీసేసినట్టు, ''అవును. అంతా నేనే ప్లాన్ చేశాను. ఏం చేస్తావు నువ్వు? ఏం నిరూపించగలవు?'' అన్నాడు వెటకారంగా.

‘‘నువ్వు కూడా ఏమీ నిరూపించలేవు’’ అంది కళ్యాణి అట్నుంచి. ‘‘...నీవు తాగే డ్రింకులో విషం కలిపింది ఎవరో కూడా నిరూపించలేవు’’ అని ఫోన్ పెట్టేసింది.

‘‘ఎవరి దగ్గర్నుంచి ఫోన్?’’ అని అడిగాడు సత్యం. అప్పటికే ప్రతాపరెడ్డి శరీరం స్వాధీనం తప్పుతోంది. జరిగిందేమిదో అతను ఊహించగలిగాడు. కష్టం మీద లేచి నిలబడబోయి శక్తి చాలక పడిపోతూ, ‘‘ఫో... ఫోన్ కళ్యాణి దగ్గర్నుంచి. అంతా... అంతా చెప్పింది’’ అన్నాడు. ‘అంతా’ అంటే సత్యం మరోలా అర్థం చేసుకున్నాడు. ఇక దాచేదేమీ లేనట్టు లేచి నిలబడి, ‘‘అవును. మేమిద్దరం ఇప్పుడు భాగస్వాములమయ్యాం’’ అన్నాడు.

ఈ షాకింగ్ న్యూస్ తో ఆ స్థితిలో కూడా ప్రతాపరెడ్డి కళ్ళు పెద్దవయ్యాయి.

మరణం అంచులో ఉన్న మనిషిని చూచి సత్యంలో శాడిస్టు నిద్ర లేచాడు. తన పంజా దెబ్బకి గిలగిలా కొట్టుకుంటూన్న ఎలుక వైపు పిల్లి చూసినట్టు గర్వంగా చూశాడు. శవంలా పడివున్న అతడి ముందు మోకాళ్ళ మీద కూర్చుని, ‘‘గుర్తుందా ముసలాడా? నా గురించి కళ్యాణికి మంచి రిపోర్టు ఇవ్వడం కోసం లక్షరూపాయలు అడిగావు. కళ్యాణి కార్యకలాపాలు ఎప్పటికప్పుడు నాకు చెప్పటంకోసం మరో లక్ష పెంచావు. ఆపై నాకు సాయం చేసినందుకు ఇరవై లక్షల వాటా అడిగావు. అప్పుడే అనుకున్నాను నీకు పోయేకాలం సమీపించిందని..! నిజానికి నువ్వు నాకు చేసిన సాయం ఏమిటి? నా తిండి తింటూ నా ఖర్చుతో మందు కొడుతూ అన్నీ చచ్చు ప్లాన్‌లు వేశావు. ఒక్కటీ అనుకున్నట్టు జరగలేదు. ఇప్పుడిక శ్రీకళ్యాణి నాదయింది. ఇన్ని స్వయంగా చేసుకున్నవాడిని నిన్ను అడ్డు తొలగించుకుంటే మాత్రం తప్పేముందనుకున్నాను. మనిద్దరం కలిసి అశ్వత్థామని తొలగిస్తే ఒక పీడ వదుల్తుందనుకున్నాం కదా. నిన్ను కూడా తొలగిస్తే పూర్తి పీడ పోతుందని నేను అనుకున్నాను. అర్థమైందా? ఇక హాయిగా చావు...’’ అంటూ గ్లాసు మీద ఉన్న వేలిముద్రలు తుడిచి, విషం సీసా జేబులో పెట్టుకొని తాపీగా బయటకు నడిచాడు. మెట్లుదిగి పోర్టికోలో ఉన్న తన కారు స్టార్ట్ చేశాడు.

ప్రతాపరెడ్డి గతంలో పోలీసు. వయసు పై బడ్డా శరీరంలో ఇంకా కాస్త ధృఢత్వం వుంది. సత్యం గదిలోంచి బయటకు వెళ్ళిన రెండు క్షణాల వరకూ తేరుకోలేక పోయాడు. కోపమూ, కసీ, నిస్సహాయతా కలిసిన ఇరిటేషన్ వల్ల అతడి మొహం ఎర్రబడ్డ సూర్యుడిలా ఉంది.

కాళ్ళలోకి శక్తినంతా తీసుకుని దేకుతూ బెడ్‌రూంలోకి వెళ్ళాడు. ప్రాణాలు పోవటం తెలుస్తోంది. పోలీసు శరీరం కాబట్టి ఆ మాత్రమన్నా తట్టుకోగలిగింది. తడిమి డ్రాయర్ లోంచి రివాల్వర్ తీశాడు. లేచి నిలబడటానికి సత్తువ సరిపోలేదు. నేల మీద అలాగే దేకుతూ బాల్కనీలోకి వచ్చాడు.

నాలుక వెనక్కి లాక్కుపోతోంది. జుట్టులోంచి చెమట ధారాపాతంగా కారుతోంది. వళ్ళంతా వణికిపోతోంది. గచ్చు మీద అలాగే బోర్లా పడుకుని ఒక చేతిలో రివాల్వర్ పట్టుకుని, మరో చేతిలో బాల్కనీ తాలూకు ఊచలు పట్టుకుని అతికష్టం

మీద క్రిందికి చూశాడు. ఆ సమయానికి సత్యం పోర్టికోలోంచి కారు బయటకు తీస్తున్నాడు. కారు కిటికీలోంచి ప్రొఫైల్‌లో కనబడుతున్నాడు.

ప్రతాపరెడ్డి రెండు చేతుల్తో రివాల్వర్ ఎత్తి పట్టుకున్నాడు. మూత పడుతున్న కళ్ళకి సత్యం మసకరూపు లీలగా గోచరమవుతోంది.

ట్రిగ్గర్ నొక్కాడు. పోలీస్ ట్రయినింగ్ ఆఖరిసారి అతడికి ఉపయోగపడింది.

ఒకే బుల్లెట్... సత్యం నుదుటి కణతలోంచి మెదడులోకి దూసుకు పోయింది. కేక కూడా పెట్టకుండా సత్యం స్టీరింగ్ మీదకి ఒరిగిపోయాడు. పైన బాల్కనీ మీద ప్రతాపరెడ్డి కూడా నేల మీదకి తల వాల్చేశాడు. పోతూన్న అతడి ప్రాణాలకి పెద్ద శబ్దం వినిపించింది.

కారు వెళ్ళి ప్రహరీగోడకి కొట్టుకున్న శబ్దం అది. సత్యం శరీరం కార్లో నుజ్జు నుజ్జు అయిపోయింది.

**ఉపసంహారం**

''**భగవంతుడితో** మానవజాతికి అవసరం లేదని భగవంతుడి యొక్క స్థానాన్ని శాస్త్రవిజ్ఞానం ఆక్రమించిందని ఈనాటి మేధావులు నమ్ముతున్నారు. కర్మల తాలూకు జ్ఞాన చైతన్యమే విశ్వాసం. సృష్టికంతా భగవంతుడే మూలకారణం! జీవితంలో వచ్చే కష్ట నిష్ఠూరాలను తట్టుకోవటం కోసమూ, తనకు ఆప్తులైనవారిని కోల్పోయినప్పుడూ, ఆస్తి సర్వస్వం పోగొట్టుకున్నప్పుడూ, దేవుణ్ని నమ్మటం ద్వారా మనిషి తనకి కావాల్సిన ధైర్యాన్ని పొందుతాడు''.

పందిరి రాటకు కూర్చుని వింటూన్న ఒక వ్యక్తి లేచి బయటకు నడిచాడు. ఒక కంబళి కప్పుకున్న వ్యక్తి కూడా అతడితో పాటు బయటకు వచ్చాడు. దాదాపు పది రోజులుగా జరుగుతున్న ఆ ఉపన్యాసాలు చాలామంది భక్తుల్ని ఆకర్షిస్తున్నాయి. రోజు రోజుకీ శ్రోతల సంఖ్య పెరుగుతోంది. దూరంగా మైకులోంచి ఉపన్యాసం వినబడుతోంది. అర్ధరాత్రి కావస్తోంది. అక్కడక్కడా దీపాలు మినుక్కు మినుక్కుమని వెలుగుతున్నాయి. ఊరు నిదురపోయి చాలా సేపయింది.

''వచ్చేసావేం?'' కంబళి కప్పుకున్న రెండో వ్యక్తి మొదటి మనిషిని అడిగాడు. అతడు బాగా వృద్ధుడు.

యువకుడిలా ఉన్న మొదటి వ్యక్తి గాఢంగా నిట్టూర్చాడు. ''ఈ ఉపన్యాసాల్లో నాకు ఏమీ కొత్త కనపడటంలేదు. ఆస్తి సర్వస్వం పోగొట్టుకున్నప్పుడు గుర్తొచ్చే దేవుడు నిరర్థకుడు. ఆప్తులయినవారు చనిపోతే ఆ బాధని పోగొట్టుకోవటం దేనికి? అంత సులభంగా పోయేది ప్రేమ కాదు. వియోగం వల్ల కలిగే బాధని పోగొట్టగలిగే శక్తి దేవుడికి కూడా లేదని నేను నమ్ముతున్నాను''.

ఇద్దరూ కలిసి ఇరుకు సందులగుండా నడవటం ప్రారంభించారు. వీధి దీపాలు లేవు. మురికి కాలువ నుంచి వచ్చే వాసన దుర్భరంగా ఉంది. యువకుడు అన్నాడు. ''ఒక మహారాజుకు భయంకరమైన రోగం వచ్చి, ప్రతి దినం మనిషి

రక్తంతో స్నానం చేయించాలని గానీ వైద్యుడు సలహా ఇచ్చినట్టయితే, ప్రజలంతా వారంతట వారే రక్తం ఇచ్చే పరిస్థితుల్ని కల్పించటం కోసం ఆ రాజు మత గురువుల్ని నియమించటానికి కూడా సిద్ధపడతాడని ప్రసిద్ధ రచయిత టాల్‌స్టాయ్ అన్నాడు. మనిషికి ఈ రకంగా తాను ఉపయోగపడటం దేవుడు చేసుకున్న దురదృష్టం...''

దుమ్ము నిండిన కళ్ళతో, ధూళి నిండిన శరీరంతో ఉన్న ఆ యువకుడు అలా మాట్లాడటం చూసి కంబళి కప్పుకున్న వృద్ధుడు విస్మయంతో ''ఎవరు బాబు నువ్వు?'' అని అడిగాడు.

''బాధకి మూలకారణం కోసం అన్వేషిస్తున్న వాణ్ని.''

''పేరేమిటి బాబూ?''

''కార్తికేయ''

★ ★ ★

అతడు ఇల్లు విడిచి ఎంతకాలం అయిందో అతడికే తెలీదు. ఎక్కువ కాలమై ఉండక పోవచ్చు. మనసు పరిపక్వం చెందటానికి 'కాలం' ప్రామాణికం కాదు. పరిపక్వం అన్న మాటకి అర్థం తెలుసుకోవటానికే అతను ఇల్లు వదిలాడు.

అనూజ్ఞ మరణించిందన్న వార్త అతనిని నిలువెల్లా కదిల్చివేసింది. ఇంట్లో అప్పటి వరకూ కళకళలాడుతూ తిరిగిన పాప, హఠాత్తుగా శూన్యంలో అదృశ్యమయిపోతే... ఆ ఇంట్లోనూ, మనసులోనూ ఏవిధంగా వెలితి ఏర్పడుతుందో, ఆ విధమైన అలజడే అతనిలోనూ చోటు చేసుకుంది. గలగలపారే సెలయేరులా ముగ్ధంగా, మనోహరంగా, మూర్తీభవించిన హుషారుగా... పరిచయమైన కొద్దికాలంలోనే హృదయంలోకి నడిచి వచ్చిన ఆ అల్లరి పిల్ల తరువాత్తరువాత అతడి కళకు స్ఫూర్తినిచ్చి,అతడి బొమ్మకు రూపునిచ్చి, అతడి ప్రేమతో నిమిత్తం లేకుండా – ''ప్రేమంటే ఇలా ఉండాలి'' అని తెలియ జెప్పి ఆ తరువాత వీడ్కోలు కూడా చెప్పకుండా వెళ్ళిపోతే, అతడు పిచ్చివాడుకాకేం చేస్తాడు? కదిలే ఆకులోనూ, తినే కంచంలోనూ అతడికి ఆ బొమ్మ రూపమే కనబడసాగింది.

కొద్దిరోజుల్లోనే అతడి స్తబ్ధత పరాకాష్టకు చేరుకుంది. ఆ సమయంలోనే అతడి బొమ్మ ప్యారిస్‌లో జరిగిన పోటీలలో అత్యుత్తమ కళాఖండంగా ఎన్నుకోబడింది. లండన్‌కు చెందిన ఒక ప్రైవేట్ మ్యూజియం యజమాని ఆ బొమ్మని వెయ్యి వందల డాలర్లకి కొనడానికి ముందుకు రావటంతో దేశంలోని పత్రికలన్నీ రాత్రికి రాత్రి అతడిని ఆకాశానికి ఎత్తేశాయి. అంతకాలం అతడి కళని గుర్తించని ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశాయి. ఒక లండన్ టైమ్స్ పత్రిక అతడి చిత్రాన్ని 'మోనలిసా' పెయింటింగుతో పోల్చి ఎడిటోరియల్ వ్రాసింది.

కాని ఇవేమీ అతడికి తెలీదు.

అంతకుముందు రాత్రే అతను ఇల్లు వదలి వెళ్ళిపోయాడు.

(ముగింపు వచ్చే నెలలో)

Click here to share your comments